
సాక్షి
పల్నాడు
గురువారం । 7 । డిసెంబర్ । 2023



వరద నీరు విడుదల

తాడేపల్లిరూరల్ : ఎగువన భారీ వర్షాలు కురవడంతో బుధవారం ప్రకాశం బ్యారేజ్ వద్ద ఇరిగేషన్ అధికారులు స్వల్పంగా గేట్లు ఎత్తి దిగువకు 18,500 క్యూసెక్కుల వరద నీటిని వదిలారు.



దుర్గమ్మ సేవలో..

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ బుధవారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు.

శతాధిక వృద్ధుడు మృతి



గుంటూరు రూరల్: తురకపాలెం గ్రామానికి చెందిన పనుమర్తి శ్యామ్యూల్‌జాన్ (101) బుధవారం అనారోగ్యంతో మృతిచెందాడు. అతనికి ఐదుగురు సంతానం. భార్య కాంతమ్మ గతంలోనే మరణించారు. శ్యామ్యూల్‌జాన్ వ్యవసాయ పనులు చేస్తుండేవారు.

న్యూస్‌రీల్

16, 17న స్విమ్మింగ్ పోటీలు

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16, 17 తేదీలలో రాష్ట్రస్థాయి 9వ సబ్‌జూనియర్, జూనియర్ బాలల వింటర్ ఆక్వాటిక్ అంతర్ జిల్లాల చాంపియన్‌షిప్ పోటీలు, రాష్ట్ర జట్టు ఎంపిక నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ కార్యదర్శి వై.వి.సుబ్బారెడ్డి తెలిపారు. అలాగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొనే జిల్లా సబ్‌జూనియర్, జూనియర్ జట్ల ఎంపిక పోటీలు ఈనెల 10వ తేదీ ఆదివారం నిర్వహిస్తున్నట్టు వివరించారు. పట్టణంలోని సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల స్విమ్మింగ్ పూల్‌లో ఈపోటీలు జరగనున్నట్టు వెల్లడించారు. స్విమ్మింగ్‌తోపాటు వాటర్‌పోలో జట్టు ఎంపికలూ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈనెల 9న శనివారం లోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలలో పల్నాడు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు.

అమరేశ్వరునికి లక్ష బిల్వార్చన



అమరావతి: అమరేశ్వరాలయంలో స్వామికి బుధవారం దాతల సహకారంతో లక్షబిల్వార్చనను అత్యంత భక్తిశ్రద్ధలతో ఆలయ అర్చకులు, వేద పండితులు జరిపించారు. తొలుత మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. ఆలయ వేద పండితులు గణపతి హోమం, సూర్యనమస్కారాలు నిర్వహించారు. స్వామికి విశేష అలంకరణ చేశారు. అనంతరం సహస్ర నామాలతో రుత్విక్కులు అమరేశ్వరునికి లక్ష బిల్వ దళార్చన నిర్వహించారు. బాలచాముండికా అమ్మవారికి లక్ష కుంకుమార్చన నిర్వహించారు

పులిచింతలకు వరద నీరు



అచ్చంపేట : నదీ పరీవాహక ప్రాంతాలలో కురుస్తున్న వర్షాలకు పులిచింతల ప్రాజెక్టులో వరదనీరు వచ్చిచేరడంతో జలాశయంలో నీటి నిల్వ ఒక టీఎంసీ పెరిగింది. ప్రాజెక్టులో నిన్నమొన్నటి వరకు 13.7200 టీఎంసీలు ఉండగా, బుధవారం సాయంత్రానికి 14.8260 టీఎంసీలకు పెరిగింది. ఎగువ నుంచి 1,0231 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 522.50 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 8,036, ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 837.90 అడుగుల వద్ద ఉంది.

యార్డుకు 18,688 బస్తాల మిర్చి రాక



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 18,688 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 17,861 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.22,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 24,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.9,000 నుంచి రూ.20,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,000 నుంచి 23,300 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 13,807 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.



కోటప్పకొండరోడ్డు ఇస్లాంపేటలో కూలిన ఇంటి గోడను పరిశీలించి యజమానితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



నకరికల్లులో వరి పొలంలో నిలిచిన నీరు బయటకు పంపేందుకు కాలువలు తీయిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు



క్రోసూరు వద్ద పొంగి ప్రవహిస్తున్న అందుకూరు ఎద్దువాగు

సహాయం.. వాయువేగం

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతర పర్యవేక్షణ ఫలితం

- తుఫాన్ బాధితులకు తక్షణ ఉపశమనం
- వెల్లువలా కదిలిన అధికార యంత్రాంగం
- లోతట్టు ప్రాంతాల ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలింపు
- పంట నష్టం అంచనాల్లో అధికారులు
- పొలాల్లో నిలిచిన నీరు తొలగింపునకు చర్యలు
- 257 గ్రామాల్లో యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ



అమరావతి పల్లోటి కాలేజ్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో బాధితులతో మాట్లాడుతున్న పెదకూరపాడు ఎమ్మెల్యే శంకరరావు



రెంటచింతల మండలం పాలువాయిలో పడిపోయిన వరిపంటపై పారుతున్న వర్షపు నీరు



దుర్గి మండలం ముటుకూరు గ్రామంలో కూలిన మట్టి మిద్దె



తొండపిలో నీట మునిగిన మిరప పంటను చూపుతున్న రైతులు

సాక్షి, నరసరావుపేట: మిచాంగ్ తుఫాన్ బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం వాయువేగంతో కదిలింది. సహాయక చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాతావరణ శాఖ అల్పపీడన హెచ్చరికలు జారీ చేసినప్పటి నుంచి నిరంతరం అధికారయంత్రాంగంతో సమీక్షలు జరిపారు. నష్ట నివారణ చర్యలు చేపట్టాలని, బాధితులను ఆదుకోవాలని ఆదేశాలు చేశారు. ఫలితంగా అధికారులు వెల్లువలా కదిలారు. సహాయక చర్యలు వేగవంతం చేశారు. బాధితులకు తక్షణ ఉపశమనం కల్పించారు. ప్రాణ, భారీ ఆస్తి నష్టాలను నివారించారు.

క్షేత్రస్థాయిలోకి అధికారులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో జిల్లా అధికారయంత్రాంగం క్షేత్రస్థాయిలో పర్యటించింది. మంగళవారం సహాయక చర్యలు ముమ్మరంగా చేపట్టింది. జిల్లాలో తీసుకున్న చర్యలను బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో సీఎంకు కలెక్టర్ శివశంకర్, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, జేసీ శ్యాంప్రసాద్ వివరించారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు ధైర్యం చెప్పారు. దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు.

ప్రాథమికంగా పంట నష్టం అంచనా

తుఫాన్ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పంట నష్టాలను వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. వరి 780 హెక్టార్లలో మునిగింది. మరో 2,728 హెక్టార్లలో నేలవాలింది. 890 హెక్టార్లలో పత్తి, 11,081 హెక్టార్లలో శనగ, 94 హెక్టార్లలో మినుము, 108 హెక్టార్లలో కంది, 40 హెక్టార్లలో పొగాకు దెబ్బతింది. 120 హెక్టార్లలో మొక్కజొన్న నేలవాలింది. 82.15 హెక్టార్లలో అరటి, 2,569 హెక్టార్లలో మిర్చి, 71.8 హెక్టార్లలో కూరగాయల పంటలకు నష్టం కలిగింది. మంగళ, బుధవారాల్లో వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు, సిబ్బంది పొలాలకు వెళ్లి పంటలను ఎలా కాపాడుకోవాలో రైతులకు సూచనలు, సలహాలు అందించారు. వర్షం తగ్గిన తర్వాత చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు.

ప్రత్యేక శిబిరాల్లో 1,679 మందికి ఆశ్రయం

లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను రక్షించేందుకు అధికారులు ఆరు మండలాల పరిధిలో 14 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. 1,679 మందికి ఆశ్రయం కల్పించారు. అల్పాహారం, భోజనం, మంచినీరు సమకూర్చారు. 10,200 ప్యాకెట్ల ఆహారం, 17,770 వాటర్ ప్యాకెట్లు అందించారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్యసేవలు అందించారు. లోతట్టు ప్రాంతాలతోపాటు పొలాల్లో నిలిచిన నీరు తొలగింపునకు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు



నరసరావుపేట రూరల్‌లో గొనెపూడి వద్ద చప్టాపై ప్రమాదకరంగా ప్రవహిస్తున్న వాగు

మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం 8 గంటల వరకు జిల్లావ్యాప్తంగా భారీ వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. జిల్లాలోని 28 మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా సత్తెనపల్లి మండలంలో 181.2 మిల్లీమీటర్ల వర్షం పడగా చిలకలూరిపేటలో 174.2 మి.మీ, బొల్లాపల్లిలో 162.2 మి.మీ, నరసరావుపేటలో 154.2 మి.మీ వర్షం కురిసింది. భారీ వర్షానికి తోడు పెద్ద ఎత్తున వచ్చిన ఈదురుగాలులతో వందల ఎకరాల్లో పంట పొలాలు నీట మునిగాయి. భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. భారీ వర్షాలకు ఆరు పశువులు చనిపోయాయి. 17 ఇళ్ల ధ్వంసమయ్యాయి.

వేగంగా స్పందించిన విద్యుత్ సిబ్బంది

ఈదురు గాలుల వల్ల జిల్లాలో సుమారు రూ.2.62 కోట్ల విలువైన విద్యుత్ స్తంభాలు, లైన్లు, పరికరాలు ధ్వంసమయ్యాయి. ఇందులో 33కేవీ విద్యుత్ స్తంభాలు 5, 11కేవీ స్తంభాలు 224, ఎల్‌టీ లైన్ స్తంభాలు 42 ఉన్నాయి. అలాగే 63 కిలోమీటర్ల పొడవున 11కేవీ లైన్, 9.3 కిలోమీటర్ల పొడవున ఎల్‌టీ, 5.5 కిలోమీటర్ల పొడవున ఏబీ కేబుల్ ఈదురుగాలులకు పడిపోయాయి. 95 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పాడయ్యాయి. ఫలితంగా 257 గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచింది. దీంతో వేగంగా స్పందించిన అధికారులు, సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన సరఫరాను పునరుద్ధరించారు.

రైతులు అధైర్యపడవద్దు

- బాధితులందరికీ ప్రభుత్వం భరోసా
- రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు



నందిగామలో మిరప పంటను పరిశీలించి వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: తుఫాన్ బాధితులు ఎవరూ అధైర్యపడవద్దని, రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. బుధవారం సత్తెనపల్లి మండలం నందిగామలో ముంపునకు గురైన మిర్చి, ఇతర పంటలను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పొలంలోకి వెళ్లి ఏ మేరకు నీరు నిలిచిందో, పంటలు ఏ స్థాయిలో దెబ్బతిన్నాయో ప్రత్యక్షంగా పరిశీలించి తుఫాన్ వల్ల ఎంత నష్టం జరిగిందని వ్యవసాయ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమై ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. కష్టకాలంలో అధికారులందరూ అప్రమత్తంగా ఉండి స్థానిక నాయకుల సహకారంతో జరిగిన నష్టాన్ని నివారించాలన్నారు. పంట నష్ట వివరాలను సేకరించి సత్వరమే చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేసినట్టు పేర్కొన్నారు. పూర్తిస్థాయిలో పంట నష్టం అంచనాలు వేయాలని పేర్కొన్నారు. రైతులకు ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం నిబంధనల ప్రకారం అందించేందుకు కృషి చేస్తానన్నారు. వరద ముంపు, ఎలా నష్టపోయినప్పటికీ రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు అందుబాటులో ఉండి తాత్కాలిక ఉపశమనం మార్గాలను సూచించడంతోపాటు నష్ట నివారణ చర్యలను తీసుకోవాలన్నారు. మంత్రి అంబటి రాంబాబు వెంట ఇన్‌చార్జ్ ఏడీఏ శ్రీధర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు వ్యవసాయ సలహా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళం విజయ భాస్కర్ రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కట్టా సాంబయ్య, తహశీల్దార్ ఎస్.సురేష్, నాయకులు ఉన్నారు.

ప్రతి కుటుంబాన్నీ ఆదుకుంటాం

- మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున, కలెక్టర్ రంజిత్‌బాషా భరోసా
- ఐలవరంలో బాధిత కుటుంబాలకు రూ.2,500, నిత్యావసరాలు పంపిణీ



ఐలవరం పునరావాస కేంద్రంలో తలదాచుకున్న బాధితులతో మాట్లాడుతున్న మంత్రి నాగార్జున, కలెక్టర్ రంజిత్‌బాషా, ఆర్డీఓ హేలా షారోన్

ఐలవరం(భట్టిప్రోలు): మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో పునరావాస కేంద్రాల్లో ఉంటున్న ప్రతి కుటుంబాన్నీ ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున తెలిపారు. భట్టిప్రోలు మండలం ఐలవరం గ్రామంలో రెండు రోజులుగా స్థానిక సచివాలయం-2, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో తల దాచుకుంటున్న 26 తుఫాన్ బాధిత కుటుంబాలకు మంత్రి నాగార్జున, కలెక్టర్ రంజిత్ బాషా రూ.2,500 చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ప్రతి కుటుంబానికీ 25 కిలోల బియ్యం, లీటర్ పామాయిల్, కిలో ఉల్లిపాయలు, కిలో కందిపప్పు, కిలో బంగాళ దుంపలు, కిలో టమాటాలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి నాగార్జున మాట్లాడుతూ తుఫాన్ ఉధృతిని గమనించి ప్రభుత్వం నాలుగు రోజుల ముందు నుంచే సహాయక చర్యలు ముమ్మరం చేసినట్లు తెలిపారు. కలెక్టర్ రంజిత్‌బాషా మాట్లాడుతూ ఈ రెండు రోజులు ప్రతి పునరావాస కేంద్రంలో ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజన సదుపాయాలు కల్పించినట్టు వెల్లడించారు. ఇందుకోసం జిల్లాకు రూ.2 కోట్లు కేటాయించామని వివరించారు. శిబిరంలో 82 మంది తలదాచుకున్నారని తెలిపారు. అనంతరం వారిని ఇళ్లకు చేర్చారు. తర్వాత తుఫాన్ ధాటికి పడిపోయిన వరి పంటను కలెక్టర్, మంత్రి పరిశీలించి రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో రేపల్లె ఆర్డీఓ హేలా షారోన్, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ తిరువీధుల ఉదయ భాస్కరి, సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు, కో-ఆప్షన్ సభ్యులు షేక్ సలీమ్, మండల ప్రత్యేక అధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు, తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ జి.చంద్రశేఖరరావు, మాజీ ఎంపీపీ మాచర్ల హేమసుందరరావు, ఎంపీటీసీ సభ్యులు మురుగుడు శ్రీనివాసరావు, సచివాలయ ఇన్‌చార్జ్ నీలం దేవరాజు, పంచాయతీ కార్యదర్శి గోలి శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ టి.ఉషారాణి, వైఎస్సార్ సీపీ నాయకులు దావూరి నాగమల్లేశ్వరరావు, తిరువీధుల బాలాజి పాల్గొన్నారు.

పొలాల్లో వర్షపునీరు తొలగింపునకు చర్యలు

సీఎంకు తెలియజేసిన కలెక్టర్ శివశంకర్



సీఎం సమీక్షలో కలెక్టరేట్ నుంచి పాల్గొన్న కలెక్టర్ శివశంకర్, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, జేసీ శ్యాంప్రసాద్

నరసరావుపేట: మిచాంగ్ తుఫాన్ వల్ల పంట పొలాల్లో నిలిచిన వర్షపు నీటిని త్వరగా తొలగించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. బుధవారం తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని తుఫాన్ ప్రభావ జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. తుఫాన్ అనంతరం చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టరేట్ నుంచి సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ జిల్లాలోని పరిస్థితులను సీఎంకు వివరించారు. సమీక్షలో ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కూలిన చారిత్రక ఆలయ శిఖరం



భారీ వర్షాలకు కొణిదెనలో కూలిన ఆలయ శిఖరం

బల్లికురవ: ఎంతో చరిత్ర కలిగిన ఆలయం ఆరేళ్లుగా జీర్ణావస్థతో కూలే దశకు చేరింది. కానీ ఏ అధికారీ పట్టించుకోలేదు. ఫలితంగా మిచాంగ్ తుఫాన్ వల్ల కురిసిన భారీ వర్షాలకు బుధవారం ఆలయ శిఖరం కూలింది. బల్లికురవ మండలంలోని కొణిదెన గ్రామాన్ని 12వ శతాబ్దంలో చోళ రాజులు పాలించారు. అప్పట్లో గ్రామంలో 101 బావులు తవ్వారని ప్రతీతి. 101 శిలలు ఏర్పాటు చేశారని చెబుతారు. గ్రామానికి ఆగ్నేయ భాగంలో ఎత్తైన కొండపై శ్రీదేవి, భూదేవి సమేత చెన్న కేశవ స్వామి ఆలయాన్ని అప్పట్లో చోళ రాజులు నిర్మించారు. ఈ ఆలయానికి 36 ఎకరాల భూములు ఉన్నాయి. ఆలయం జీర్ణావస్థకు చేరటంతో గత ప్రభుత్వ హయాంలో గ్రామస్తులు పురావస్తు శాఖకు, దేవదాయ శాఖకు ఫిర్యాదు చేశారు. అయితే ఎవరూ పట్టించుకోలేదు. ఆలయ భూముల కౌలు వేలం ఏటా దేవదాయ శాఖకు వెళుతోంది. ఈ క్రమంలో ఆలయ వెనుక భాగంలోని శిఖరం కూలటంతో భక్తులు, అర్చకుడు ఆలయంలోకి వెళ్లాంటేనే భయపడుతున్నారు. ఇప్పటికైనా రెండు శాఖలూ సమన్వయంతో ఆలయాన్ని అభివృద్ధి చేసి పూర్వవైభవం తీసుకురావాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

రైతులకు పూర్తి న్యాయం

నేలవాలిన వరి పొలాలు పరిశీలించిన బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి



తడిచిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోన

పిట్టలవానిపాలెం: ఇది రైతు పక్షపాత ప్రభుత్వమని, నష్టపోయిన రైతులను తప్పకుండా ఆదుకుంటామని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి చెప్పారు. పిట్టలవానిపాలెం మండలంలో బుధవారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు. తుఫాన్ వల్ల నేలవాలిన వరి పంటను, తడిచిన ధాన్యాన్ని పరిశీలించి రైతులకు ధైర్యాన్నిచ్చారు. భవనంవారిపాలెం, చోడిపాలెం, కోమలి, సంగుపాలెం, కోడూరు, చందోలు, ఖాజీపాలెం, పిట్టువారిపాలెం, పిట్టలవానిపాలెం గ్రామాలలో పర్యటించి వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కోన మాట్లాడుతూ తడిచిన ధాన్యాన్ని, రంగుమారిన ధాన్యాన్ని తేమ శాతంతో సంబంధం లేకుండా ప్రభుత్వం మద్దతు ధరకే కొనుగోలు చేస్తోందని స్పష్టం చేశారు. ఎవరూ అధైర్యపడవద్దని సూచించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ షేక్ బాజీ, వైస్ ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు, ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ హుస్సేన్, మునీర్, శ్యామల నాగిరెడ్డి, మాధవరావు, చేబ్రోలు వీరయ్య, చెన్నుబోయిన గంగయ్య, చల్లాపల్లి విజయరాజు తదితరులు ఉన్నారు. తుఫాన్ సమయంలో రాత్రీపగలు మండలంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించిన విద్యుత్ శాఖ ఏఈ చంద్రశేఖర్, సిబ్బందిని ఎమ్మెల్యే కోన ప్రత్యేకంగా అభినందించారు.

పోలీసుశాఖకు హోంగార్డులే వెన్నెముక

హోంగార్డు ఆవిర్భావ దినోత్సవంలో జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి


ప్రతిభ చూపించిన హోంగార్డుకు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట: రాష్ట్రంలోని పోలీసు శాఖకు హోంగార్డు విభాగం వెన్నెముకలాగా పనిచేస్తుందని జిల్లా ఎస్పీ వై.రవి శంకర్‌రెడ్డి కొనియాడారు. బుధవారం 61వ హోంగార్డ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా అదనపు ఎస్పీ(ఏఆర్) రామచంద్రరాజు పర్యవేక్షణలో, ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లా హోంగార్డు ఆర్ఐ రవికిరణ్ గౌరవ వందనం సమర్పించి సాదరంగా ఆహ్వానించారు. ఎస్పీ మాట్లాడుతూ ఈ రోజు చాలా శుభదినమని, 1963 డిసెంబరు 6వ తేదీన మన రాష్ట్రంలో హోంగార్డు ఆర్గనైజేషన్ ఏర్పాటు చేశారన్నారు. అప్పటి నుంచి విధి నిర్వహణలో ప్రజలకు ఉత్తమ సేవలు అందజేస్తున్నారన్నారు. పోలీస్ శాఖలోని ట్రాఫిక్ రెగ్యులేషన్, డ్రైవింగ్, కంప్యూటర్ ఆపరేటర్, శాంతి భద్రతల పరిరక్షణ, నేరాలను అరికట్టడం, బందోబస్తు విధుల్లో హోంగార్డులు పోలీసులకు వెన్నుదన్నుగా నిలిచి అనిర్వచనీయ సేవలు అందిస్తున్నారన్నారు. హోంగార్డుల్లో ఎవరైనా చనిపోయిన, పదవి విరమణ పొందిన కుటుంబాలకు ఆర్థికంగా ఆదుకొనేందుకు జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులు వారి వేతనం నుంచి ఒకరోజు వేతనాన్ని స్వచ్ఛందంగా ఇవ్వడానికి ముందుకొచ్చినందుకు అభినందిస్తున్నట్లు చెప్పారు., హోంగార్డ్ సహజ మరణం పొందిన కుటుంబానికి రూ.5 లక్షలు, ప్రమాదవశాత్తు మృతి చెందిన వారి కుటుంబానికి రూ.10 లక్షలు ప్రభుత్వం ఎక్స్ గ్రేషియో రూపంలో అందజేస్తుందన్నారు. పోలీసు కానిస్టేబుల్స్ పోస్టుల కోసం దరఖాస్తు చేసుకొనే హోంగార్డులకు సివిల్ పోస్ట్‌లకు 15 శాతం, ఏపీఎస్పీ కానిస్టేబుల్ పోస్టులకు 20 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నారన్నారు. తమకు అప్పగించిన బాధ్యతలను నీతి నిజాయితీలతో, చిత్తశుద్ధితో నిర్వర్తించి అందరికీ మార్గదర్శకంగా నిలవాలని, పోలీసు శాఖ ప్రతిష్ఠ పెంచడానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఎటువంటి క్లిష్టమైన బాధ్యతలు అప్పగించినా పనిచేసేందుకు ముందుండాలని, ప్రజాసేవయే కర్తవ్యం అన్న విషయాన్ని ఎల్లవేళలా గుర్తుంచుకోవాలన్నారు. సమావేశానంతరం మరణించిన హోంగార్డు కుటుంబ సభ్యులకు చెక్కులను అందజేశారు. మరో 21 మంది హోంగార్డులకు విధులలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు ప్రశంసా పత్రాలను అందించారు. అదనపు ఎస్పీ చంద్రశేఖర్, డీఎస్పీలు కేవీ. మహేష్, రవిచంద్ర, చిన్నికృష్ణ, సీఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో 2713.6 మిల్లీమీటర్ల వర్షం

- అత్యధికంగా సత్తెనపల్లి మండలంలో..
- అత్యల్పంగా వెల్దుర్తిలో!

నరసరావుపేట: జిల్లాలో గడిచిన 24 గంటల వ్యవధిలో మిచాంగ్ తుఫాన్ కారణంగా 2713.6 మిల్లీమీటర్ల (271 సెం.మీ) వర్షం కురిసిందని వాతావరణ అధికారులు వెల్లడించారు. మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు జిల్లాలోని 28 మండలాల్లో వర్షం పడిందన్నారు. అత్యధికంగా సత్తెనపల్లి మండలంలో 181.2 మిల్లీ.మీ వర్షం పడగా చిలకలూరిపేటలో 174.2, బొల్లాపల్లిలో 162.2, నరసరావుపేటలో 154.2 మిల్లీ.మీ వర్షం కురవగా, అత్యల్పంగా వెల్దుర్తి మండలంలో 31.6 మి.మీ వర్షం కురిసింది.

మండలాల వారీగా పరిశీలిస్తే...

మాచర్లలో 51.0, దుర్గిలో 62.0, రెంటచింతలలో 32.2, గురజాలలో 83.2, దాచేపల్లిలో 55.2, కారంపూడిలో 98.2, పిడుగురాళ్లలో 99.6, మాచవరంలో 88.0, బెల్లంకొండలో 81.2, అచ్చంపేటలో 82.2, క్రోసూరులో 63.8, అమరావతిలో 89.0, పెదకూరపాడులో 107.0 మి.మీ వర్షం కురిసింది. అలాగే రాజుపాలెంలో 113.2, నకరికల్లులో 108.8, వినుకొండలో 83.4, నూజెండ్లలో 76.8, శావల్యాపురంలో 86.8, ఈపూరులో 80.2, రొంపిచర్లలో 116.2, ముప్పాళ్లలో 101.4, నాదెండ్లలో 134.6, యడ్లపాడులో 116.2 మి.మీటర్ల వర్షం కురిసింది.

బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

జలవనరుల శాఖమంత్రి అంబటి రాంబాబు

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన వారందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని, వరద ముంపునకు గురైన ప్రాంతాల్లో ఉన్న వారిని పునరావాస కేంద్రాలకు తరలించి అన్ని సౌకర్యాలు కల్పించటం జరిగిందని రాష్ట్ర జలవనరుల శాఖమంత్రి అంబటి రాంబాబు చెప్పారు. మండలంలోని గోళ్ళపాడు గ్రామంలో ముంపునకు గురైన ఎస్టీ కాలనీని బుధవారం పరిశీలించారు. పునరావాస కేంద్రంలో ఉన్న కాలనీవాసులతో మాట్లాడి వారికి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాల గురించి ఆరా తీశారు. ప్రభుత్వం అండగా ఉంటుందని, అధైర్య పడవద్దని చెప్పారు. పునరావాస కేంద్రంలో ఎన్ని కుటుంబాలు ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. ముందుగా ముంపునకు గల కారణాలను అధికారులతో పరిశీలించి, వరద నీరు బయటకు పంపేందుకు తీసుకున్న చర్యలను స్వయంగా పరిశీలించారు. తక్షణ సహాయానికి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు.

కేజీబీవీ పాఠశాల పరిశీలన

వరద నీటితో ముంపునకు గురైన కేజీబీవీ పాఠశాలను మంత్రి రాంబాబు పరిశీలించారు. అక్కడ ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థినులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. వరద నీటిని బయటకు పంపేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సత్తెనపల్లి ఆర్డీవో బీఎల్ఎస్ రాజకుమారి, తహసీల్దార్ ఎం.భవానిశంకర్, ఎంపీడీవో పి.పుట్టారెడ్డి, సర్పంచ్‌లు గోపు అప్పమ్మ (గోళ్ళపాడు), చయికం వెంకటప్పారెడ్డి (కుందురు వారిపాలెం), వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంజిఎం రామలింగారెడ్డి, రెండెద్దుల వెంకటేశ్వర రెడ్డి, అన్నపురెడ్డి సాయిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు అచ్యుత శివప్రసాదు, మాజీ సర్పంచ్ ఒబ్బాని కుమారి తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధిత రైతులకు ప్రభుత్వం అండ

- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు
- పలు గ్రామాల్లో ముంపునకు గురైన పంటల పరిశీలన


పిరాట్లంక గ్రామంలో వరి కంకులను పరిశీలిస్తున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ

రేపల్లె రూరల్: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను రాష్ట్రప్రభుత్వం ఆదుకునేందుకు ఇప్పటికే కసరత్తు ప్రారంభించిందని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు చెప్పారు. తుఫాన్ ప్రభావంతో రేపల్లె పట్టణ, మండలంలోని పలు గ్రామాలలో నష్టపోయిన వరిపైరును బుధవారం ఆయన పరిశీలించి రైతులకు ధైర్యం చెప్పారు. ఈ సంవత్సరం వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ ప్రభుత్వం కాల్వల ద్వారా సకాలంలో నీరు అందించటంతో ఖరీఫ్ సాగు ఆశాజనకంగా ఉందన్నారు. ఈ పరిస్థితుల్లో తుఫాన్ పంటలకు నష్టం చేకూర్చటం బాధాకరమన్నారు. తుఫాన్ ప్రభావంతో నాలుగు రోజులుగా ఈదురుగాలులతో పాటు కురిసిన వర్షంతో పైరు నేలవాలటం, నీటిలో వరి ఓదెలు ఉండటం ప్రతి ఒక్కరిని తీవ్రంగా కలచివేసే అంశమన్నారు. రైతు బాగుంటేనే రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉంటుందని నమ్మి రైతుల వెన్నంటి ఉండే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటారని భరోసానిచ్చారు. రైతులతో పాటు కౌలు రైతులు, దేవదాయ భూములను సాగుచేసే రైతులను ఆదుకునే విధంగా నివేదికలు తయారు చేయాలని జిల్లా కలెక్టర్‌లను కోరతామన్నారు. అధికారులు తమ పరిధిలోని సాగుభూములను పరిశీలించి నిష్పక్షపాతంగా నష్టపరిహారం అంచనాలను సిద్ధం చేయాలన్నారు. ఈ సందర్భంగా మండలంలోని పేటేరు, చాట్రగడ్డ, మోర్తోట, చెన్నుపల్లివారిపాలెం, పిరాట్లంక, తుమ్మల, పోటుమెరక గ్రామాలలో పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఆయనవెంట ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

పునరావాస కేంద్రాల్లో బాధితులకు ఆపన్నహస్తం ..

రేపల్లె రూరల్: మిచాంగ్ తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవడంలో రాష్ట్ర ప్రభుత్వంతో పాటు అధికారులు సైతం సఫలీకృతులయ్యారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. పట్టణ, మండలంలోని ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలలో ఆశ్రయం పొందినవారికి బుధవారం ప్రభుత్వ సాయం అందజేసి, నిత్యావసర వస్తువులు పంపిణీ చేసి మాట్లాడారు. వాతావరణశాఖ నుంచి తుఫాన్ హెచ్చరికలు వచ్చినప్పటి నుంచి రాష్ట్రప్రభుత్వం జిల్లా, మండలస్థాయి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిందన్నారు. లోతట్టు ప్రాంతాల్లో, కచ్చా గృహాలలో నివాసం ఉంటున్నవారి భద్రత కోసం ప్రభుత్వం పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి అల్పాహారం, భోజనం సదుపాయాలు, మౌలిక సదుపాయాలు కల్పించిందన్నారు. వైద్యశాలలు ఏర్పాటు చేసి అవసరమైన వారికి మందులు సైతం అందించిందని గుర్తుచేశారు. ఒక్కో కుటుంబానికి రూ.2500 నగదుతో పాటు 25 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, నూనె, ఉల్లిపాయలు, కూరగాయలు తదితర నిత్యవసర వస్తువులు అందించి భరోసా కల్పించిందని వివరించారు.

తహసీల్దార్ మల్లికార్జునరావు మాట్లాడుతూ పట్టణంలో 156 కుటుంబాలకు రూ.2500 చొప్పున, 87 మందికి రూ.1000 చొప్పున, మండలంలో 183 కుటుంబాలకు రూ.2500 చొప్పున, 170 మందికి రూ.1000తో పాటు నిత్యవసర వస్తువులు అందించామని చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, వివిధ వార్డుల కౌన్సిలర్‌లు, కార్పొరేషన్‌ల డైరెక్టర్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

రాజ్యాంగ నిర్మాతకు నివాళి


సత్తెనపల్లి పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి మంత్రి అంబటి రాంబాబు బుధవారం పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. -సత్తెనపల్లి

కుల నిర్మూలన పుస్తకావిష్కరణ

పాత గుంటూరు: కుల నిర్మూలన పుస్తకం చదవకుండా భారతదేశ సమాజాన్ని, చరిత్రను అర్థం చేసుకోలేరని ప్రభుత్వ సలహాదారు జూపూడి ప్రభాకర్ పేర్కొన్నారు. బుధవారం బ్రాడీపేటలోని సీపీఎం కార్యాలయంలో అంబేడ్కర్, జాషువా, పూలే, పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ రచన కుల నిర్మూలన పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. సభకు కవి విల్సన్ అధ్యక్షత వహించారు.

కొండవీడు ఘాట్‌రోడ్డుపై దొర్లిన బండరాళ్లు

- తొలగించే వరకు సందర్శకులకు అనుమతులు రద్దు
- పల్నాడు జిల్లా డీఎఫ్‌వో ఎన్.రామచంద్రరావు వెల్లడి


మొదటి దశ ఘాట్ రోడ్డులోని 3.5 కిమీ మలుపు వద్ద పడిన భారీ బండరాళ్లు

యడ్లపాడు: చారిత్రక పర్యాటక కేంద్రమైన కొండవీడుకోట ఘాట్ రోడ్డుపై భారీ బండరాళ్లు దొర్లిపడ్డాయి. తుఫాను కారణంగా వరుసగా రెండు మూడు రోజులు ఎడతెరపిన వాన కురవడంతో కొండశిఖరాలపై నుంచి భారీగా నీటి ప్రవాహం కిందకు దుమికింది. ఈ క్రమంలో రాళ్ల కింద మట్టికరిగిపోయి భారీ బండరాళ్లు సైతం కదిలి దొర్లుకుంటూ వచ్చి ఘాట్‌రోడ్డుపై పడ్డాయి. ప్రధానంగా మొదటి ఘాట్‌రోడ్డు 3.5 కి.మీ.మలుపు వద్ద, కొండపై స్వాగతం ద్వారం ముందు, రెండోదశ ఘాట్‌రోడ్డు ప్రారంభంలోనూ ఈ భారీ బండరాళ్లు అస్తవ్యస్తంగా పడి ఉండటంతో సందర్శకుల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. ఈ విషయంపై పల్నాడు జిల్లా అటవీశాఖ అధికారి ఎన్.రామచంద్రరావు మాట్లాడుతూ తుఫాన్ హెచ్చరికతో కొండవీడుకోట సందర్శకులకు అనుమతుల్ని రద్దు చేశామన్నారు. మూడు రోజులుగా చెక్‌పోస్టు దాటి ఎవరినీ పైకి వెళ్లేందుకు అనుమతించకుండా గట్టి భద్రతా చర్యలు తీసుకున్నామని తెలిపారు. అధిక వర్షం కారణంగా పలుచోట్ల కొండపై ఉన్న రాళ్లు జారీ రోడ్డుపై వచ్చి పడ్డాయని వాటిని తొలగించేందుకు ఆర్అండ్‌బీ శాఖ అధికారులతో చర్చించామన్నారు. యుద్ధ ప్రాతిపదికన వాటిని తొలగించి ఆ తర్వాత సందర్శకులను అనుమతిస్తామని వెల్లడించారు.

భారతరత్న అంబేడ్కర్ ఓ విజ్ఞాన గని

- ఆయనలోని జ్ఞాన సముపార్జన మరెవ్వరికీ సాధ్యం కాలేదు
- సమ సమాజ స్థాపనతోనే అంబేడ్కర్‌కు నిజమైన నివాళి
- ఏపీ సివిల్ సప్లయీస్ వీసీఎండీ జి.వీరపాండియన్


డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జి.వీరపాండియన్


ఎన్జీరంగా వర్సిటీలో నివాళులర్పిస్తున్న వీసీ డాక్టర్ ఆర్.శారదజయలక్ష్మి


జెడ్పీలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా

ఏఎన్‌యూ: అంబేడ్కర్ అంటేనే విజ్ఞాన గని అని ఏపీ సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ వీసీ అండ్ ఎండీ, ఏపీ మార్క్‌ఫెడ్ జాయింట్ ఎండీ జి.వీరపాండియన్ అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో బుధవారం జరిగిన భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 64వ వర్ధంతి కార్యక్రమానికి వీరపాండియన్ ముఖ్య అతిథిగా హాజరై అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ అంబేడ్కర్‌లోని జ్ఞాన సముపార్జన ప్రపంచంలో మరొకరికి సాధ్యం కాలేదనే భావన ప్రపంచవ్యాప్తంగా అందరూ అంగీకరిస్తున్నారన్నారు. అందుకే ఆయన ప్రపంచ మేధావిగా కొనియాడబడుతున్నాడని తెలిపారు. అంబేడ్కర్ కలలుగన్న సమ సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రాసినప్పటినుంచి నేటి వరకు ఆయన కలలుగన్న స్వరాజ్య స్థాపనలో వెనుకబడే ఉన్నామన్నారు. ఇప్పటికీ ఆ విధంగా కృషి చేయడంలో మనం సఫలీకృతం కాలేకపోతున్నామని తెలిపారు. ఆయన ఆశయాలను భావి తరాలకు అందించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. అంబేడ్కర్ కేవలం రాజకీయ రంగంలోనే కాకుండా ఆర్థిక, న్యాయ శాఖ, సాంఘిక, సామాజిక రంగాలలో మహామేధావిగా కొనియాడబడుతున్నాడన్నారు. అంబేడ్కర్ మేధస్సు ప్రతి భారతీయునికి ఆయన రాసిన రాజ్యాంగం ద్వారా వచ్చిందన్నారు. గౌరవ అతిథి ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ పి.శామ్యూల్ జోనాథన్ మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో మనదేశంలో ఒక రాష్ట్రంలో ప్రభుత్వానికి గవర్నర్‌కు మధ్య విభేదం వచ్చిందని దానికి రాజ్యాంగం పరిష్కారం చూపించిందని గుర్తు చేశారు. మహారాష్ట్ర ప్రభుత్వం అంబేడ్కర్ ప్రసంగాలను 17 గ్రంథాలుగా ప్రచురించిందన్నారు. వాటిని విద్యార్థులు అధ్యయనం చేయాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు విద్య, వైద్యం అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుందని చెప్పారు. వీసీ ఆచార్య పి రాజశేఖర్ మాట్లాడుతూ అంబేడ్కర్ గురించి తెలుసుకోవడం భావోద్వేగ అధ్యయనం అన్నారు. అంబేడ్కర్ మేధస్సు ప్రపంచానికి ఎంతో అవసరంగా మారిందన్నారు. ప్రపంచ తత్వవేత్త జాక్ డెరిడా ప్రతిపాదించిన సూత్రాలు అంతకు ముందే అంబేడ్కర్ ప్రతిపాదించారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆనంద్ టెల్ టూంబ్డే రాసిన ద రాడికల్ ఇన్ అంబేడ్కర్ అనే గ్రంథాన్ని వీసీ విశదీకరించారు. రెక్టర్ ఆచార్య పి.వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, ప్రిన్సిపాల్స్ గంగాధరరావు, పి.సిద్దయ్య, సురేష్‌కుమార్, సీడీసీ డీన్ కె.మధుబాబు, సీడీఈ డైరెక్టర్ డాక్టర్ బి నాగరాజుపాల్గొన్నారు.

గొప్ప రాజ్యాంగం అంబేడ్కర్ ఘనతే.. జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా


గుంటూరు ఎడ్యుకేషన్: భారతదేశ రాజ్యాంగాన్ని ప్రపంచానికే ఆదర్శంగా తీర్చిదిద్దిన ఘనత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కే దక్కుతుందని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా పేర్కొన్నారు. బుధవారం బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా జెడ్పీ సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా హెనీ క్రిస్టినా మాట్లాడుతూ అట్టడుగువర్గాల అభ్యున్నతికి తపించిన అంబేడ్కర్ పటిష్టమైన రాజ్యాంగానికి రూపకల్పన చేశారని అన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు ఆమోదయోగ్యమైన రాజ్యాంగాన్ని రూపొందించడం ద్వారా అంబేడ్కర్ గొప్ప మేధావిగా కొనియాడబడ్డారని, బడుగు, బలహీనవర్గాలకు ఆయన ఆరాధ్య దైవమని కొనియాడారు. జెడ్పీ అకౌంట్స్ అధికారి శ్రీనివాసరావు, ఏఓలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రపంచ ప్రఖ్యాత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్

గుంటూరు రూరల్: ప్రపంచం గర్వించదగిన రాజ్యాంగాన్ని భారతావనికి అందించిన ఘనుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్.శారదజయలక్ష్మీదేవి తెలిపారు. బుధవారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా లాంఫాం నందున్న విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ప్రపంచంలో ఏ దేశానికి లేని రాజ్యాంగాన్ని మనకు అందించిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. పాలక మండలి సభ్యులు డాక్టర్ ఎమ్ఎస్ చైతన్యకుమారి, రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు, డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ జి.కరుణాసాగర్, పీజీ డీన్ డాక్టర్ ఎన్వీ రమణ, స్టూడెంట్స్ అఫైర్స్ డీన్ డాక్టర్ పి.సాంబశివరావు, అగ్రికల్చర్ ఇంజినీరింగ్ డీన్ డాక్టర్ మణి, కమ్యూనిటీ సైన్స్ డీన్, రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ ఎల్.ప్రశాంతి, విస్తరణ సంచాలకులు డాక్టర్ ఎ.సుబ్బరామిరెడ్డి, ఎగ్జామినేషన్ కంట్రోలర్ డాక్టర్ పి.సుధాకర్, ఎస్టేట్ ఆఫీసర్ డాక్టర్ పి.రవి, లాం సహసంచాలకులు డాక్టర్ జీఎంవీ ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ కృషి అభినందనీయం

- కలెక్టర్ ఎల్.శివశంకర్
- రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళి


అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించిన కలెక్టర్, జాయింట్ కలెక్టర్

నరసరావుపేట: రాజ్యాంగం ఏర్పాటులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కృషి అభినందనీయమని కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. బుధవారం అంబేడ్కర్ 67వ వర్ధంతి సందర్భంగా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయన జీవిత చరిత్రపై ఛాయా చిత్ర ప్రదర్శనను ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన కల్పించడానికి చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. నవంబర్ 26వ తారీకున రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలలో ప్రియాంబుల్, ప్రాథమిక విధులపై బోర్డులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రాథమిక విధుల్లోని అంశాలను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకుని అనుసరించాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, రెవెన్యూ అధికారి కె.వినాయకం, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఓబుల నాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.